ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 05.07.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాంపల్లి నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఈ ఉదయం విస్తృతంగా పర్యటించారు. స్థానికులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
2. ఆషాఢ బోనాల సందర్భంగా జులై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన, అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
3. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను లేవనెత్తారు.
4. రాష్ట్రంలో ఈరోజు 9 జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

-------------------------

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాంపల్లి నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఈ ఉదయం విస్తృతంగా పర్యటించారు. స్థానికులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా కిషన్ రెడ్డి మొదట మెహిదీపట్నం డివిజన్‌లోని అయోధ్య నగర్ బస్తీని సందర్శించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం మల్లేపల్లి డివిజన్

పరిధిలోని సీతారాంబాగ్ బస్తీలో పర్యటించి, రాంలీలా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మరో ఓపెన్ జిమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే, ఆసిఫ్ నగర్ డివిజన్‌లోని ఇందిరా నగర్ బస్తీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు.

**డెస్క్**

----------------------------

**మంత్రి పొన్నం**

ఆషాఢ బోనాల సందర్భంగా జూలై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన, అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నారు.

**డెస్క్**

---------------------------

**సీతక్క**

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. కేంద్ర నిధుల మంజూరు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను లేవనెత్తారు. ఉపాధి హామీ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

**డెస్క్**

------------------------------

**గవర్నర్**

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముంబైలోని శ్రీ సిద్ధివినాయక గణపతి దేవాలయాన్ని సందర్శించారు. ఈ ఉదయం తన సతీమణి జానకీ శుక్లాతో కలిసి దాదర్‌లో ఉన్న ఈ ప్రసిద్ధ ఆలయానికి వెళ్లిన గవర్నర్.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**డెస్క్**

----------------------------------

**అల్కా లంబా**

మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీలకు అవకాశం కల్పించడంతో పాటు, 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 25న ఢిల్లీలో భారీ ధర్నా చేపట్టనున్నట్లు, అలాగే జూలై 20 నుండి ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

**పీఎస్**

-------------------------------

**ఉత్తమ్**

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల ప్రకారమే రాష్ట్రంలోని బ్యారేజీల నిర్వహణ కొనసాగుతుందని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శాస్త్రీయ పరీక్షల అనంతరం అవసరమైన పునరుద్ధరణ చర్యలు తీసుకుంటామన్నారు. నల్గొండ జిల్లా నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అనంతరం విజయవిహార్‌లో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీలో నాణ్యతా లోపాల వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని, అక్కడ నీటిని నిల్వ చేయలేకపోవడం వల్లే కన్నెపల్లి పంపింగ్ సాధ్యం కావడం లేదన్నారు.

**పీటీసీ - నల్గొండ**

-----------------------------

**స్పోర్ట్స్**

జోర్డాన్‌లో జరగనున్న ఆసియన్ క్యాడెట్ జూడో ఛాంపియన్‌షిప్‌కు ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి హర్షవర్ధన్ భారత జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. 60 కేజీల విభాగంలో హర్షవర్ధన్ ఈ అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. జూడో క్రీడలో తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన మొట్టమొదటి క్రీడాకారుడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించిన హర్షవర్ధన్‌ను, అతని కోచ్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడల సలహాదారులు జితేందర్ రెడ్డి అభినందించారు.

**డెస్క్**

---------------------------------

**ఆయిల్ పామ్**

వరి పంట సాగు కంటే ఆయిల్ ఫామ్ పంట సాగు ద్వారా లాభాలు ఉంటాయని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామానికి చెందిన రైతు లకవత్ రాములు నాయక్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**బైట్ - రాములు నాయక్**

**పీటీసీ - సిరిసిల్ల**

---------------------------------

**ఫ్యూచర్ సిటీ**

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఫామ్‌హౌస్‌లు, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లలో నేరాల నివారణే ధ్యేయంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి పలు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. చేవెళ్ల జోన్ పరిధిలోని యజమానులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఫామ్‌హౌస్‌లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, 30 రోజుల ఫుటేజ్‌ను భద్రపరచాలని ఆదేశించారు. అతిథుల వివరాల నమోదును సులభతరం చేసేందుకు "SAFE ATITHI" యాప్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు.

**డెస్క్**

---------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఈరోజు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరుగా కురుస్తాయని తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఏర్పడిన బలమైన అల్పపీడనం కొనసాగుతోందని పేర్కొంది.

**పీఎస్**

---------------------------------

**వర్షాలు**

తొలకరి వర్షాలకే ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. పెన్ గంగ, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. బెజ్జూర్ మండలంలోని సుస్మీర్ వాగు ఉరకలెత్తడంతో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను రద్దు చేశారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

---------------------------------

**వర్షపాతం - సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిసినట్లు సిపిఓ శ్రీనివాసచారి తెలిపారు. జిల్లా అంతటా సగటున 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**పీటీసీ - సిరిసిల్ల**

---------------------------------

**ఉపాధి**

ఉపాధి హామీ పథకం కింద పెంచిన 125 పనిదినాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. పథకం కింద చేపట్టే పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణతో పాటు ఇంకుడు గుంటల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే పొదుపు సంఘాల రుణాల బకాయిలను సకాలంలో వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**పీటీసీ - నల్గొండ**

-------------------------------

**అథ్లెటిక్స్ పోటీలు**

ఈ నెల 8వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నాలుగవ జిల్లా స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**పీటీసీ - సిరిసిల్ల**

----------------------------

**ఎస్ఐఆర్**

ఖమ్మం జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం పారదర్శకంగా, చురుగ్గా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,460 మంది బీఎల్ఓలు విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పటికే 98.82 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, 11.85 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని చెప్పారు.

**పీటీసీ - ఖమ్మం**

----------------------------

**స్పాట్ కౌన్సిలింగ్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఏడు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఫేజ్-2 మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 6వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

-----------------------------------

**లోక్ అదాలత్**

ఈ నెల 18వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి మేడబోయిన నాగరాజు తెలిపారు. వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, చిట్ ఫండ్ కంపెనీలలో పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను పరస్పర రాజీ మార్గంలో పరిష్కరించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమని చెప్పారు.

**పీటీసీ - ఖమ్మం**

------------------------------

**ఓపెన్ జిమ్**

కరీంనగర్ తీగలగుట్టపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో ఈ జిమ్‌ను ఏర్పాటు చేశారు.

**పీటీసీ - కరీంనగర్**

-----------------------------

**స్త్రీనిధి**

మహిళా స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాల పంపిణీ, వాయిదాల చెల్లింపుల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం 'మన స్త్రీనిధి' అనే కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని వరంగల్ జిల్లా స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ సైదిరెడ్డి తెలిపారు. ఈ యాప్ ద్వారా

స్త్రీనిధి సేవల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని, రుణాల పంపిణీ ప్రక్రియ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

**పీటీసీ - వరంగల్**

--------------------------------